కథ

# నేనే చంపేశాను

–వై.సి.పి. వెంకటరెడ్డి



రాత్రి ఎనిమిదిన్నర దాటింది. తలుపేసి, లోపల గడియ పెట్టి, భోజనానికి వెళ్ళడానికి తయారయ్యాం నేనూ, మా ఆవిడా.కాలింగ్ బెల్ మోగింది.

"ఎవరు?" అడిగాను.

"నేన్రా రెడ్డీ!" అన్నాడు అపరిచిత వ్యక్తి.

అతడి గొంతు గుర్తించాను. మొన్ననే అతడి పెద్ద కర్మకు హాజరై నిన్న సాయంత్రమే తిరిగొచ్చాను. తలుపు తెరవాలా? వద్దా? అని ఆలోచిస్తుండగా మళ్ళీ తలుపు తట్టాడు. సందేహిస్తూనే తలుపు తెరిచాను.

ఎదురుగా నిల్చున్న అతణ్ణి చూసి నా శరీరం మీది వెంట్రుకలు నిక్కపొడుచుకున్నాయి. పిక్కల్లో సన్నగా వణుకు.

"ఎందుకురా వణుకుతున్నావ్? మలేరియా ఏమన్నా వచ్చిందా?!" అన్నాడు పరాచికమాడుతూ.

అతడెవరో కాదు. పదమూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన నా ప్రాణ మిత్రుడు.

నా నోరు పెగల్లేదు. శిలా విగ్రహంలా బిగుసుకుపోయాను.

"ఏమైందిరా నీకు?" అన్నాడు.

"ఎవ్వడొచ్చావురా రామనాథం?" అన్నాను ఎలాగో గొంతు పెగుల్చుకుని.

"మవ్వేం సత్యభామవా ఇంటికొచ్చిన శ్రీకృష్ణుణ్ణి బయటే నిల్చోబెట్టి ప్రశ్నలు వేయడానికి?"

"నిన్నేం బయటే వుండమన్నానా? లోపలకు రా!" అన్నాను జంకుతూ.

లోపలికి వచ్చాడు రామనాథం.

"మీ అన్నయొచ్చాడే!" అన్నాను మా ఆవిడతో.

లైటు వెలుగులో అతడి ముఖం చూసిన మా ఆవిడ మొహంలో రంగులు మారసాగాయి.

'వచ్చింది రామనాథమా? లేక అతడి తాలూకు ప్రేతమా?' తేల్చుకోవడానికి అతడి పాదాలకేసి తదేకంగా చూడసాగాను.

'దయ్యాలకు పాదాలు వెనుకవైపు వుంటాయని ఎవరో చెప్పగా విన్నాను. దయ్యాలున్నాయని ఎవ

రయినా అంటే లేవని వాదించే నేను అలా చూడసాగానంటే 'తనదాకా వస్తే గాని..." అన్న సామెత నా విషయంలో నిజమైందన్నమాట!'

"మీరిద్దరూ అసహజంగా ప్రవర్తిస్తున్నారు. సంగతేమిటి?" ప్రశ్నించాడు రామనాథం.

"నువ్వెళ్ళిన బస్సు ప్రమాదానికి గురైందట కదా?" అన్నాను.

"ఓహో! అదా సంగతి! నేనా బస్సులో వెళ్ళలేకపోయాను. నేను బస్సులోకి వెళ్ళగానే నా మిత్రుడు నన్ను చూసి ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోయి నేను వాళ్ళ వూరు వెళ్ళేదాకా వూర్కోలేదు".

"ఏమైతేనేం? నీకు ప్రమాదం తప్పింది అదే పదివేలు. వెళ్ళి స్నానం చెయ్! భోంచేద్దాం" అన్నాను.

రామనాథం బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. మా ఆవిడ వంట గదిలోకి వెళ్ళింది.

నేను డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని ఆలోచించసాగాను. గడచిన పది పన్నెండు రోజుల్లో జరిగిన సంఘటనలు సినిమా రీలులా నా మనోనేత్రం ముందు తిరగసాగాయి.

ఉత్తర భారత దేశ యాత్రకు వెడుతున్నానని, పది, పదిహేను రోజుల వరకూ రాలేనని రామనాథం రాసిన ఉత్తరం అందిన మర్నాడు, అతడి పెద్దకర్మ ఫలానా రోజు జరుగుతుందని ప్రచురించిన కార్డు అందింది.

యాత్రకు వెళ్ళినప్పుడు ఏదో దుర్ఘటన జరిగి రామనాథం మరణించాడని అనుకున్నాను. కనీసం శవాన్ని కూడా చూడలేక పోయినందుకు బాధపడ్డాను.

పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళాను. రామనాథం భార్య ప్రభావతమ్మ మూర్తీభవించిన శోకదేవతలా వుంది.

పెద్దకర్మ ముగిసే సరికి మధ్యాహ్నమయింది. బంధువులు, మిత్రులు భోజనాలు చేసి తమ తమ ఊళ్ళకు వెళ్ళడానికి సిద్ధమయ్యేసరికి సాయంత్రమైంది. నేనూ బయల్దేరాను.

"మీరు రేపు వెళ్ళొచ్చులే బాబాయ్. ఈరోజు ఇక్కడే వుండండి!" అన్నాడు రామనాథం పెద్ద కుమారుడు రాఘవ.

"నేనిక్కడ వుండి ఏం చేయాలి బాబూ? మీ నాన్నగారు వుంటే కాలం ఎంతో ఆనందంగా గడచిపోయేది. ఇప్పుడెవరితో మాట్లాడాలి?" అన్నాను.

"మా నాన్నగారుంటే మిమ్మల్ని వుండమని చెప్పే అవసరం ఉండేది కాదు బాబాయ్!" అన్నాడు.

నన్నెందుకు వుండమంటున్నాడో అర్థం కాక–

"ఉండి ఏంచేయాలి బాబూ?" అడిగాను.

"మేమందరం ఎక్కడెక్కడో దూర దూర ప్రాంతాల్లో వుండిపోతాం గదా! లావాదేవీలు, ఇల్లు, వాకిలి, ఆస్తిపాస్తులు పంచుకుని ఎవరి దారిన వాళ్ళు వెడితే బావుంటుందని..!" అంటూ నసిగాడు.

"గోరు చుట్టు మీద రోకటి పోటులా ఇప్పుడే ఆ ప్రస్తావనెందుకు? మీ అమ్మ గారికి మనస్తాపం కలిగేలా?" అన్నాను నచ్చజెపుతున్నట్టుగా.

"ఆమె క్షేమం కోరే మేం ఈ నిర్ణయానికొచ్చేం బాబాయ్! ఆమె ఎవరి వద్ద వుండాలనేది సమస్య గదా?" అన్నాడు రాఘవ.

అతడి ప్రవర్తన నాకు నచ్చలేదు. ఎలాగో తప్పుకోవాలనే ఉద్దేశంతో–

"మీ బంధువులందరూ ఉండగా నేనెందుకు బాబూ!" అన్నాను.

"ఎవరున్నా లేకపోయినా మీరు వుండి తీరాలి బాబాయ్! మా కుటుంబ విషయాలు మీకు తెలిసినట్టు మా బంధువులెవ్వరికీ తెలియవు" అన్నాడు.

ఇరుక్కుపోయి గిజగిజలాడినట్టు వుంది నా పరిస్థితి.

ఏం చెప్పాలో తోచక–

"సరే" అన్నాను.

రాఘవ వెళ్ళిపోయాడు.

నేను వెంకటాద్రి ఇంటికి వెళ్ళాను. వెంకటాద్రి రామనాథం తమ్ముడు.

నన్ను చూసి లేచి–

"రండి రండి!, పొద్దుటి నుంచీ మీతో మాట్లాడడానికి తీరుబడే లేదు. ఇంటి దగ్గర అందరూ క్షేమమాండీ? అనడిగాడు.

"ఏం క్షేమమో బాబూ! మీ అన్న గారి మరణం మాకూ పెద్ద షాక్‌లా వుంది" అంటుంటే నా స్వరం గాద్గదికమైంది.

"మన చేతిలో ఏముందండీ! అంతా ఆ దేవుడి లీల!" అన్నాడు.

"ఉత్తర భారత దేశ యాత్రకు వెడుతున్నానని, పదిహేను రోజుల వరకు తిరిగి రాలేనని మీ అన్న గారు నాకు ఉత్తరం రాశారు. మరి ఆయన ఇంత తొందరగా ఎందుకు తిరుగు ప్రయాణమైనట్టూ? అనుకోకుండా ఇలా ప్రమాదానికి గురి కావడం ఏమిటీ? నమ్మలేకుండా వున్నా " అన్నాను.

"మా అన్నగారు ప్రయాణిస్తున్న బస్సు ఓ లోతైన లోయలో పడిపోయింది. చాలా మంది ప్రయాణీకులు చనిపోయారు. అందరితో బాటు మా అన్న.."

వెంకటాద్రి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. తువాలుతో కళ్ళు తుడుచుకున్నాడు.

"ఆ రోజే నాకు తెలియజేసి వుంటే కడసారి దర్శనం చేసుకునే వాణ్ణి!" అన్నాను.

"అలాగా".

"శవాలన్నీ నుజ్జు నుజ్జయ్యాయి. మా అన్న గారి తల మొండెం నుంచి వేరైపోయింది. అందువల్ల శవాన్ని గుర్తించడం ఆలస్యమైంది".

"కనీసం తలైనా దొరికిందా?"

"లేదు".

"అయితే మీ అన్నయ్య చనిపోయాడని ఎలా అనుకున్నారు?"


"ఆయన చొక్కా జేబులో ఓ ఉత్తరం దొరికింది. అందులో అన్నగారి అడ్రసుంది".

"ఉత్తరం లేకపోతే మీ అన్న చనిపోయినట్టు మీకు తెలిసేది కాదు గదా? ప్చ్.. చాలా భయంకరమైన చావు" అంటూ నిట్టూర్చాను.

"చేసిన పాపం వూరికే పోతుందాండీ!" అంది వెంకటాద్రి భార్య కమలమ్మ దీర్ఘాలు తీస్తూ.

"ఏం పాపం చేశాడమ్మా? నాకు తెలిసినంత వరకూ ఆయన చాలా మంచి మనిషి" అన్నాను.

"ఏమీ తెలీనట్టు మాట్లాడతారేమిటండీ! మేమిక్కడ రాత్రింబవళ్ళూ నెత్తిన దుమ్ము పోసుకుని సేద్యం చేస్తూ వుంటే వాళ్ళు టౌన్లో హాయిగా వుండి వారి పిల్లల్ని చదివించుకుని ప్రయోజకుల్ని



చేసుకున్నారు. వేర్లుపడక ముందు మేం సంపాదించిన భూమిలో కూడా పాలు పంచుకున్నారు. ఇదన్యాయం కాదా!" అంది కమలమ్మ.

'ఆస్తంతా మీకు అప్పగించి కేవలం జీతం డబ్బు మీదే ఆధారపడి వాళ్ళు ఇరవయ్యేళ్ళు గడిపారు. పంట లోంచి ఓ చిల్లి గవ్వ కూడా తీసుకు పోలేదు. పండిన పంట తాలూకు డబ్బుతోనే గదా మీరు భూమి కొన్నారు. మీ పిల్లల్ని కూడా వాళ్ళ వద్ద వుంచుకున్నారు చదివించాలని. కానీ చదవకుండా చెడిపోతే వాళ్ళా బాధ్యులు?' అని అనాలనుకున్నాను. కాని ఆమె నోటి నాటానికి భయపడి అనలేకపోయాను.

"మళ్ళీ వస్తా వెంకటాద్రీ!" అంటూ లేచి ప్రభావతమ్మ వద్దకు వెళ్ళాను.

"అంకుల్! నాన్న గారి ఉద్యోగం ఎవరికిస్తారు?" అన్నాడు రామనాథం చిన్న కొడుకు ప్రసాద్.

"మీ అమ్మకో, మీ చెల్లాయికో లేక నీకో ఇవ్వొచ్చు".

"అమ్మకు పెన్షనొస్తుందట కదా?"

"వస్తుంది".

"అయితే అమ్మకు ఉద్యోగం అవసరం లేదు. చెల్లాయి ఎప్పడైనా పరాయి ఇంటికెళ్ళేదే. ఆమెకు ఉద్యోగమిస్తే ఎవర్నో బతికిస్తుంది. నేను పనీ పాటా లేకుండా బైరాగిలా తిరుగుతున్నాను. నాకు వచ్చేలా చూడండంకుల్!" అన్నాడు ప్రసాద్.

"నీకేం మగవాడివి. ఆస్తిపాస్తులున్నాయి. ఉద్యోగం లేకపోయినా బతుకుతావు. అమ్మాయికి ఉద్యోగం వుంటే కట్న కానుకలు లేకుండా ఎవరయినా చేసుకుంటారు" అంది ప్రభావతమ్మ.

"అప్పడు తక్కువ కట్నమిచ్చి బర్రెగొడ్డు లాంటి అమ్మాయిని నా మెడకు కట్టారు. ఇప్పడు డబ్బు దండిగా వస్తుందని అంటున్నారు. ఇరవై, ముప్పయ్ వేలు మా మొహాన కొడితే మేమూ కాస్త మర్యాదస్తుల్లా బతుకుతాం అత్తమ్మ గారూ!" అంటూ గొణిగాడు పెద్దల్లుడు.

"మీకు తక్కువిచ్చి మాకు లక్షలిచ్చారా?" అంది అతడి మరదలు కళ్ళు తిప్పతూ.


"పోనీలెండి. అమ్మను నేనే సాకుతాను" అంది పెద్దమ్మాయి.

"ముగ్గురు కుమారులం వుండగా అమ్మను అల్లుళ్ళ వద్దకు పంపితే లోకం ఏమంటుంది?" అన్నారు పెద్ద కొడుకు, రెండో కొడుకు కోరస్‌గా.

"మా బరువు మీ మీద ఎందుకు మోపాలి? అమ్మ నావద్దనే వుంటుంది" అన్నాడు చిన్నకొడుకు.

"ఓహో! అమ్మ మీద ఎంత ప్రేమ ఒలకబోస్తున్నావే? వచ్చే డబ్బు పంచేద్దాం. తరువాత అమ్మను నీవద్దే వుంచుకో! ఎవరొద్దన్నారు?" అన్నారు అన్నలిద్దరూ.

బాత్‌రూమ్ తలుపు తెరుచుకున్న చప్పడవ్వడంతో




ఈ లోకం లోకి వచ్చాను.

"సంతగతేంటిరా రెడ్డీ? మీరెందుకు కంగారు పడుతున్నారు?" అన్నాడు రామనాథం బాత్‌రూమ్ లోంచి వచ్చి.

"భోంచేద్దాంరా, తర్వాత చెబుతాను" అన్నాడు.

ఇద్దరమూ భోజనానికి కూర్చున్నాం. మాట మార్చి లోకాభిరామాయణం లోకి దించాను.

భోంచేసి వరండాలో కూర్చున్నాం.

"అసలు సంగతి చెప్పనేలేదు" అన్నాడు మళ్ళీ మర్చిపోకుండా.

చెప్పకపోతే వదిలేటట్టు లేడని, అతని కుటుంబ సభ్యుల మనోగతాలు కూడా అతడికి తెలియడం మంచిదని జరిగిన విషయాలన్నింటినీ పూస గుచ్చినట్టు చెప్పి–

"నాకో సందేహం!" అన్నాను.

"ఏమిటి?" అన్నాడు.

"నీ అడ్రసుకు వచ్చిన ఉత్తరం పరాయి మనిషి జేబులోకి ఎలా వెళ్ళింది?" అన్నాను.

"బస్సులో ఎక్కేటప్పడు ఎవడో దొంగ వెధవ ఉబ్బెత్తుగా వున్న నా జేబును చూసి డబ్బని భ్రమ పడి జేబులోని కాగితాల్ని కొట్టేశాడు. పోలీసు స్టేషన్లో రిపోర్టివ్వాలని ఆలోచిస్తుండగా నా స్నేహితుడు వారించి వన్ను వాళ్ళ ఊరికి తీసుకెళ్ళాడు".

"అయితే ఆ శవం, నీ కాగితాలు కొట్టేసిన దొంగది కాబోలు".

"కావచ్చు..." అని కాసేపు మౌనంగా వుండి–

"కాదురా రెడ్డీ..." అంటూ రామనాథం ఏదో చెపచపడానికి తటపటాయిస్తున్నట్టుగా వుంది.

"ఏమిటి? చెప్పరా. ఏమిటో చెప్పాలనుకుంటున్నావు. ఆగిపోయావే!" అన్నాను.

"నేనెందుకు బ్రతకాలి?"

"అదేం ప్రశ్న?"

"నా మీద ఎవరికీ అభిమానం, ఆప్యాయత, అనురాగం లేనప్పడు నేను ఎవరి కోసం బ్రతకాలి?"

"అందరూ నీలా ఆలోచిస్తే లోకంలో ఎవ్వరూ బతకరు".

"అందరి కుటుంబ సభ్యులూ ఇలాగే వుంటారంటావా?"

"అందరి పరిస్థితీ కాస్త అటూ,ఇటూ ఒకేలా వుంటుంది. కాకపోతే కొందరు బయటపడతారు, కొందరు బయటపడరు".

" ఏమోరా! ఇంత జరిగాక ఇంక బతకాలన్న ఆశ లేదురా! ఒక వేళ బతికినా సన్యసించడమే మేలనిపిస్తోంది. ఇంటికి వెళ్ళాలనిపించడం లేదు" అన్నాడు నిరాసక్తంగా.

"సరే పడుకో, తెల్లవారిన తర్వాత ఆలోచిద్దాం. ఎక్కువగా ఆలోచించకు. అసలే గుండె జబ్బు మనిషివి" అన్నాను.

వరండాలో మిత్రుడి పడక ఏర్పాట్లు చేసి పడుకోమని చెప్పి, మేం లోపల పడుకున్నాం.

గోడ గడియారం నాలుగు కొట్టింది.

"అరే, రెడ్డీ నేను బతకనురా...!" అంటూ రామనాథం పెట్టిన గావుకేక విని ఉలిక్కిపడి లేచి, ఆదరా బాదరాగా వరండాలోకొచ్చి చూశాను.

గుండె మీద రుద్దుకుంటూ సుళ్ళు తిరిగిపోతున్నాడు రామనాథం.

ఉరుకులు పరుగులు మీద వెళ్ళి డాక్టర్ని పిల్చుకుని వచ్చాను.

డాక్టరు రామనాథం పల్స్ చూసి–

"సారీ!ఇతను చనిపోయాడు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పి గుండె పోటు వచ్చేలా చేసి రామనాథాన్ని చంపింది నేనే.

"నా స్నేహితుణ్ణి చంపింది నేనే! నేనే చంపాను. నేనే చంపేశాను!" అంటూ అరవసాగాను.

'మా ఆయనకు పిచ్చి పట్టింది! మా ఆయనకు పిచ్చి పట్టింది!!" అంటూ నాకంటే బిగ్గరగా కేకలేయసాగింది మా ఆవిడ.